క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: కొండాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వైట్‌ఫీల్డ్ ప్రాంతం, సిగ్నేచర్ టవర్స్, మీనాక్షీ అపార్ట్‌మెంట్స్, ఆదిత్యా అపార్ట్‌మెంట్స్, జూబ్లీగార్డెన్, అపర్ణా అపార్ట్‌మెంట్స్, భిక్షపతినగర్, రాఘవేంద్రకాలనీ ఏబీసీ బ్లాక్స్ ప్రాంతాలు, రాజరాజేశ్వరి నగర్, జాగృతికాలనీ, కొత్తగూడ ప్రాంతంలో విద్యుత్ ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

గచ్చిబౌలిలో..

రాయదుర్గం: గచ్చిబౌలి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ వేణుగోపాల్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ఏపీహెచ్‌బీ కాలనీ, డాగ్‌పార్కు ఏరియా, రాడిసన్ హోటల్, లీ మెరిడియన్, డీఎల్‌ఎఫ్ గేట్ నెంబర్ 1,2,3 ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు వినియోగదారులు గమనించాలని కోరారు.

◆ ఎస్కీ ఫీడర్ పరిధిలో.. విద్యుత్ మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 2 గంటలకు సాయంత్రం 4 గంటల వరకు ఎస్కీ, జయభేరి పైన్‌వ్యాలీ, కేర్ ఆస్పత్రి ఏరియా, ఐడీబీఐ బ్యాంక్, బ్రహ్మకుమారీస్ శాంతిసరోవర్, ఎస్ఎంఆర్ అపార్ట్‌మెంట్స్ ప్రాంతం, రాక్ ఏరియా కాలనీ ప్రాంతాలలో విద్యుత్ ఉండదని ఏఈ వేణుగోపాల్ తెలిపారు.

'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 'మాస్టరింగ్ ది మైండ్' అనే అంశంపై ముంబాయికి చెందిన అంతర్జాతీయ మోటివేషనల్ స్పీకర్ బికె.ఈవి.గిరీష్ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఉంటుంది. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040–23001234లో సంప్రదించవచ్చని నిర్వాహకులు తెలిపారు.

కరోనా పరీక్షలు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం 10 మందికి కొవిడ్ ర్యాపిడ్ ఆంటీజన్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగిటివ్ వచ్చిందని నిర్వాహకులు మనోహర్ తెలిపారు. అదేవిధంగా తొమ్మిది మందికి ఆర్టీపీసీఆర్ టెస్టులు నిర్వహించినట్లు తెలిపారు.

త్వరలో పశువుల ఆసుపత్రి ప్రారంభం

కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్‌లో నిర్మిస్తున్న పశువుల ఆసుపత్రి పనులను శుక్రవారం కూకట్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు రూ.70 లక్షల నిధులతో నిర్మిస్తున్న ఆస్పత్రి పనులను పూర్తి చేసి త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈ శివప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై స్పెషల్ క్యాంపెయిన్

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో శని, ఆదివారాల్లో ఓటరు నమోదుపై స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహించనున్నట్లు ఈఆర్ఓ, డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గ పరిధిలో 622 పోలింగ్ స్టేషన్ భవనాల్లో బీఎల్‌ఓలు ఓటరు ముసాయిదాలతో అందుబాటులో ఉంటారన్నారు. పారదర్శకంగా ఓటరు జాబితా తయారు చేసే క్రమంలో అక్టోబర్ 1 తేదీ నాటికి 18 ఏళ్ళు నిండే వారు కూడ ముందస్తుగా ఓటు కోసం నమోదు చేసుకోవచ్చని, ఓటు హక్కు ఉన్న వారు కూడా జాబితాలో పేరు ఉందో లేదో పరిశీలించుకోవాలని సూచించారు. వాటిలో ఏమైనా తప్పులు ఉంటే సవరణకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నియామకం



హఫీజ్‌పేట్ : కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గం ఓబీసీ చైర్మన్‌గా నక్క నరేందర్ యాదవ్‌ను తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఓబీసీ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ నియమించారు. ఈ మేరకు శుక్రవారం నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా నరేందర్ యాదవ్ మాట్లాడుతూ తనకు అవకాశం ఇచ్చిన శ్రీకాంత్‌గౌడ్‌కు శేరిలింగంపల్లి పీసీసీ ప్రతినిధి సత్యంరావులకు కృతజ్ఞతలు తెలిపారు.

ట్రిపుల్ ఐటీ.. సిల్వర్ జూబ్లీ



ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లో ఇటీవల పేరెంట్స్, గార్డియన్స్‌తో ఓపెన్ ఆడిటోరియంలో మాట్లాడుతున్న డైరెక్టర్ ప్రొఫెసర్ పీజే నారాయణన్

రాయదుర్గం: దేశంలోనే నాణ్యమైన విద్య అందించే ఉన్నత విద్యాసంస్థల్లో గచ్చిబౌలిలోని ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్) ఒకటి. 1998 సెప్టెంబర్ 2న ఏర్పాటు చేశారు. అప్పుడప్పుడే ఏర్పడుతున్న ఐటీ సంస్థలకు మేధావి యువతను అందించేందుకు ఈ విద్యాసంస్థ ఎంతో దోహదం చేసింది. ఇంకా చేస్తూనే ఉంది. ఇది ఏర్పడి 25 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా ప్రత్యేక కథనం.

నాడు కలెక్టరేట్ కోసం ...

1998లో అప్పటి ప్రభుత్వం గచ్చిబౌలిలో రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని భావించింది. ఆయా శాఖల భవనాలను ఒకే ప్రాంగణంలో ఏర్పాటు చేయాలని తలపెట్టి నిర్మించింది. అయితే దేశంలోనే మొట్టమొదటి ట్రిపుల్ ఐటీ హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం భావించింది. దీంతో ఈ భవన సముదాయంలో ట్రిపుల్ ఐటీ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది.

స్వయంప్రతిపత్తిగల ఉన్నత విద్యాసంస్థ

హైదరాబాద్‌లో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల మధ్య లాభాపేక్షలేని భాగస్వామ్యంగా స్థాపించబడిన మొదటి స్వయంప్రతిపత్తి గల ఉన్నత విద్యాసంస్థగా ఈ ట్రిపుల్ ఐటీ గుర్తింపు పొందింది. ఇది ఏర్పడిన నాటి నుంచి గవర్నింగ్‌బాడీ చైర్మన్‌గా ప్రొఫెసర్ రాజ్‌రెడ్డి కొనసాగారు.

◆ ప్రస్తుతం ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ పీజేనారాయణన్, ఆర్ అండ్ డీ డీన్‌గా ప్రొఫెసర్ సి.వి.జవహర్, రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ కేఎస్‌రాజన్ కొనసాగుతున్నారు.

◆ 2001లో ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌కు డీమ్డ్ యూనివర్సిటీగా గుర్తింపు వచ్చింది.

◆ మొదట్లో ప్రత్యేక అధికారిగా రాష్ట్ర ఐటీ శాఖ కార్యదర్శి అజయ్‌ప్రకాశ్ సాహ్నీని నియమించారు.

◆ ట్రిపుల్‌ఐటీలో 26 రీసెర్చ్ డెవలప్‌మెంట్ సెంటర్స్, మరో ఐదు కంబైన్డ్ సెంటర్స్ ఉన్నాయి

◆ ఇక్కడి ప్రాంగణంలోనే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన 'టీ–హబ్' ఫేజ్–1, కోహ్లి సెంటర్ ఆన్ ఇంటెలిజెంట్ సిస్టమ్స్(కేసీఐఎస్) కొనసాగుతున్నాయి.

నిర్వహించే కోర్సులివే..

◆ ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు, డ్యూయల్ డిగ్రీలో ఐదేళ్ల కోర్సులు, పీజీ , ఎంఫిల్, పీహెచ్‌డీ కోర్సులు, పార్ట్ టైమ్ ప్రోగ్రామ్స్ అండ్ పీజీ స్టూడెంట్ స్టేటస్ ప్రోగ్రామ్(పీజీఎస్ఎస్‌పీ) కోర్సులు నిర్వహిస్తారు.

ప్రత్యేక కేంద్రాలు ..

◆ ట్రిపుల్‌ఐటీ ప్రాంగణంలో టీహబ్ మొదటి ఫేజ్ ఏర్పాటు చేశారు.

◆ కోహ్లి సెంటర్ ఆన్ ఇంటెలిజెంట్ సిస్టమ్స్ (కేసీఐఎస్).



ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లో వింధ్య భవనం



ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ ప్రాంగణం

డిగ్రీ అడ్మిషన్లకు 4వ తేదీ ఆఖరు

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాల పటాన్‌చెరులో మొదటి సంవత్సరంలో అడ్మిషన్లకు విద్యార్థులు ప్రత్యేకంగా స్పెషల్ ఫేజ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి సెప్టెంబర్ 4వ తేదీ ఆఖరు అని ప్రిన్సిపల్ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కళాశాలలోనే రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. ఇప్పటికి దోస్త్ లో రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివిధ గ్రూపుల్లో ఉన్నా ఖాళీల వివరాలు... బీబీఎ (రిటైల్ మేనేజ్ మెంట్) కోర్సు లో 43 సీట్లు, బిఏ తెలుగు మీడియంలో 33 సీట్లు, ఇంగ్లిష్ మీడియంలో 34 సీట్లు ,బీకాం కంప్యూటర్ తెలుగు మీడియం లో 03 సీట్లు,ఇంగ్లీష్ మీడియం లో 14 సీట్లు,బీఎస్‌సి లైఫ్ సైన్సెస్, తెలుగు మీడియంలో 16 సీట్లు, ఇంగ్లిష్ మీడియం లో 64 సీట్లు, బీఎస్‌సీ ఫిజికల్ సైన్సెస్‌లో 65 సీట్లు ఉన్నాయని,ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

5 నుంచి అంతర్జాతీయ వర్క్‌షాప్

రాయదుర్గం: ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఏడీఏపీపై అంతర్జాతీయ వర్క్‌షాప్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు 'మనూ' ప్రొఫెసర్, వర్క్‌షాప్ కన్వీనర్ డాక్టర్ ప్రియా హసన్ తెలిపారు. భౌతిక శాస్త్రం, గణితశాస్త్ర విభాగంతో పాటు పూణేలోని యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రోఫిజిక్స్ (ఐయూసీఏఏ) సంయుక్త ఆధ్వర్యంలో సెప్టెంబర్ 5 నుంచి 8వ తేదీ వరకు పైథాన్‌తో ఖగోళ శాస్త్ర డేటా విశ్లేషణపై నాలుగు రోజుల అంతర్జాతీయ వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేశామన్నారు. 5వ తేదీ ఉదయం 10 గంటలకు సయ్యద్ హమీద్ లైబ్రరీ ఆడిటోరియంలో జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమానికి వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ ముఖ్యఅతిథిగా విచ్చేస్తారన్నారు.

మహిళా సాధికారతకు కృషి

హెచ్‌సీయూ వీసీ ప్రొఫెసర్ బీజేరావు



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ బీజేరావు

రాయదుర్గం: మహిళా సాధికారత కోసం 75 ఏళ్ళుగా ప్రయత్నిస్తున్నామని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజే రావు పేర్కొన్నారు. గచ్చిబౌలి హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ ఆడిటోరియంలో సెంటర్ ఫర్ విమెన్స్ స్టడీస్, స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ సహకారంతో మహిళా సాధికారతపై 'ఎంపవర్–20' అనే అంశంపై ఒకరోజు సింపోజియంను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ 75 ఏళ్ళు అయినా ఇంకా సాధికారిత అనే అంశం చాలా దూరంగా ఉందని భావించాల్సి వస్తోందన్నారు. సెంటర్ ఫర్ విమెన్స్ స్టడీస్ హెడ్ ప్రొఫెసర్ కె సునీతారాణి, స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ జ్యోతిర్మయిశర్మ మాట్లాడుతూ సాధికారతను సాధించడంలో బహుత్వ ప్రాముఖ్యతను చూపారు. ఆకాశవాణి హైదరాబాద్ ప్రోగ్రామ్ హెడ్ ఉదయశంకర్ మాట్లాడుతూ సామాజిక సాధికారత సాధించడంలో లోటుపాట్లను పూరించాల్సిన ఆవశ్యకతపై వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర విమెన్ సేఫ్టీ వింగ్ డీఐజీ బడుగుల సుమతి, సంవాద్ భాగస్వాములు ఏక్తాబహ్లా, తెలంగాణ రాష్ట్ర చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ డాక్టర్ శాంతాథౌతం, ట్రాన్స్‌జెండర్ హక్కుల కార్యకర్త వైజయంతి వసంత, జహీరాబాద్‌లోని సంఘం రేడియో మేనేజర్ నర్సమ్మ, ఆకాశవాణి హైదరాబాద్ ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్ నిహారా కానేటి ప్రసంగించారు.

బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

రాయదుర్గం: ప్రధాని నరేంద్రమోదీ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని కర్నాటక రాష్ట్ర మాజీ మంత్రి, ఎమ్మెల్యే మునిరత్నంనాయుడు సూచించారు. బీజేపీ ప్రవాస్ యోజనలో భాగంగా శుక్రవారం శేరిలింగంపల్లిలోని గచ్చిబౌలి డివిజన్ గౌలిదొడ్డిలోని ఎస్ఆర్ కన్వెన్షన్‌లో గచ్చిబౌలి డివిజన్ శక్తి కేంద్రాల ఇన్‌చార్జీలు, బూత్ అధ్యక్షుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషిచేయాలన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీజేపీని గెలిపించాలనే లక్ష్యంతో ఉండాలని, శేరిలింగంపల్లిలో పార్టీ విజయం కోసం శక్తికేంద్రాలు, బూత్ కమిటీ చిత్తశుద్ధితో పనిచేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్, నియోజవర్గం కన్వీనర్ రాఘవేందర్‌రావు, సమావేశంలో రాష్ట్ర, జిల్లా, డివిజన్ నాయకులు బూత్ కమిటీ, శక్తి కేంద్రాల ప్రతినిధులు ,మోర్చాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యే మునిరత్నంనాయుడు

ఉపాధ్యాయులది కీలకపాత్ర

కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న అతిథులు

శేరిలింగంపల్లి: సమాజంలో ఎక్కువగా గౌరవించబడేవారు ఉపాధ్యాయులేనని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం శేరిలింగంపల్లి నల్లగండ్ల రవీందర్‌రెడ్డి గార్డెన్స్‌లో మండల రికగ్నైస్డ్ ప్రైవేట్ స్కూల్స్ కరస్పాండెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో కీలకపాత్ర పోషించేది టీచర్లేనన్నారు. కార్యక్రమంలో ప్లానిటరీ సొసైటీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ ఎన్ రఘునందన్‌రావు, శేరిలింగంపల్లి ఎంఈఓ వెంకటయ్య, బిజ్జం ట్రస్ట్ వ్యవస్థాపకులు బిజ్జం వెంకటేశ్వరరెడ్డి, వెంకట్‌రెడ్డి, పాపిరెడ్డి, ఎస్ఎన్‌రెడ్డి, అనిల్‌కుమార్, జి నారాయణరెడ్డి, భరత్‌గౌడ్, మీనేందర్‌రావు, ఆచార్య, శ్రీనివాసశంకర్, అబ్దుల్ రహమాన్, భీష్మారెడ్డి, జి శ్రీనివాసరావు, రమణి, వరలక్ష్మి పాల్గొన్నారు.

3న ఉచిత మెగా హెల్త్ క్యాంప్



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన నాయకులు

కూకట్‌పల్లి: గ్రేటర్ రాయలసీమ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేది ఆదివారం కేపీహెచ్‌బీలోని రమ్యగ్రౌండ్స్ నందు ఉచిత మెగా హెల్త్ క్యాంప్‌ను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాఘవ్ బాణా ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జస్టిస్ పి. లక్ష్మణరెడ్డి ముఖ్య అతిథిగా రానున్నారని తెలిపారు. శిబిరంలో జనరల్ ఫిజీషియన్, గైనకాలజిస్ట్, ఆర్థో, కార్డియాలజి వైద్యులతో పాటు ఉచిత రక్త, కంటి పరీక్షలు చేస్తారని తెలిపారు. అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేస్తారన్నారు. కార్యక్రమంలో భాగంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజలు ఈ శిబిరంను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

సంతోషిమాతకు గాజుల అలంకారం

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ఆలయాలు శ్రావణశోభను సంతరించుకున్నాయి. శ్రావణమాసం శుక్రవారంను పురస్కరించుకుని సంతోషిమాత అమ్మవారిని గాజులతో అలంకరించారు. సంతోషిమాత, మహంకాళి ఆలయాల్లో భక్తుల రద్దీ నెలకొంది. ఆలయాల్లో సామూహిక వ్రతాలు, కుంకుమార్చన ,ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కాశమ్మ హత్య కేసులో నిందితుల కోసం గాలింపు

పశ్చిమ బెంగాల్‌కు ప్రత్యేక బృందాలు

గచ్చిబౌలి: ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని ఓ నిర్మాణ సంస్థ సెల్లార్‌లో దారుణ హత్యకు గురైన కాశమ్మ కేసులో నిందితుల కోసం గాలింపు ముమ్మరం చేశారు. సీసీ కెమెరా ఫుటేజీలో కనిపించిన వ్యక్తి వివరాలు సేకరించిన గచ్చిబౌలి పోలీసులు ప్రధాన నిందితుడిని గుర్తించినట్లు సమాచారం. హత్య జరిగిన తరువాత సీసీ ఫుటేజీలో కనిపించిన వ్యక్తి పరారవడంతో అతనిపై అనుమానాలకు బలం చేకూరింది. దీంతో అతని కోసం పశ్చిమబెంగాల్‌కు ప్రత్యేక బృందాలు వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. గవర్నర్ తమిళిసై కాశమ్మ కేసు వివరాలను తెలియజేయాలని పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే.. త్వరలో నిందితుడిని అరెస్ట్ చేస్తామని గచ్చిబౌలి పోలీసులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలం వీరన్నగూడ(బొంతపల్లి) గ్రామంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలోని అన్నదాన సత్రం నుంచి కోనేరు వరకు దాతల సహకారంతో రూ.13లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ఈఓ శశిధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆవాలయ అభివృద్ధిలో దాతలు భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు సోమయ్య, అర్చకులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

జిన్నారం(పటాన్‌చెరు): ఖాజీపల్లి గ్రామంలో అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు శుక్రవారం కూల్చివేయించారు. తహశీల్దార్ రవికుమార్ ఆదేశాల మేరకు ఆర్ఐ జయప్రకాశ్ నారాయణ అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాలను జేసీబీతో కూల్చివేయించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ గ్రామకంఠం, ప్రభుత్వ స్థలాల్లో కొంత మంది అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. ప్రభుత్వ స్థలాల రక్షణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

పటాన్‌చెరు టౌన్: ఓటు హక్కు కోసం 18 సంవత్సరాలు పైబడిన యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవాలని బీజేపీ ఓబీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్ అన్నారు. పటాన్‌చెరు మండలం ముత్తంగి గ్రామంలో బీజేపీ శ్రేణులు ఓటుహక్కుపై శుక్రవారం అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దేవేందర్‌గౌడ్, కిసాన్ మోర్చా జిల్లా నాయకులు వీరారెడ్డి ,పటాన్‌చెరు మండల అధ్యక్షుడు కావలి వీరేశం, ఇస్నాపూర్ వార్డు సభ్యులు నారాయణదాసు ,పటాన్‌చెరు మండల ఉపాధ్యక్షుడు సాయికుమార్ ,ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు రాచమల్ల నరేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సందయ్య మెమోరియల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

కర్ణాటక ఎమ్మెల్యే మునిరత్నం నాయుడు



కళ్ళద్దాలను అందజేస్తున్న ఎమ్మెల్యే మునిరత్నం నాయుడు, భిక్షపతి యాదవ్, రవికుమార్

హఫీజ్‌పేట్ : సామాజిక, రాజకీయ, సేవా రంగంలో సందయ్య మెమోరియల్ ట్రస్ట్ ముందంజలో ఉందని కర్ణాటక రాష్ట్ర బీజేపీ ఎమ్మెల్యే మునిరత్నం నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం చందానగర్ జీహెచ్ఎంసీ కార్యాలయం అంబేడ్కర్ విగ్రహం వద్ద సందయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షల శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ ఎమ్మెల్యే మునిరత్నం నాయుడు, మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్‌లు హాజరై అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాన గుణం కొంతమందికే ఉంటుందని అందులో భిక్షపతి యాదవ్ ముందు వరుసలో ఉంటారన్నారు. తండ్రి బాటలో నడుస్తున్న యువ నాయకుడు రవికుమార్ యాదవ్ అని అభినందించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగరవేయడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గం కన్వీనర్ రాఘవేంద్రరావు, అనంతరెడ్డి, మణిభూషణ్, దేవాల్ యాదవ్, మహిపాల్‌రెడ్డి, నవతరెడ్డి, సింధురెడ్డి, ఎల్లేష్, శ్రీధర్, రామ్‌రెడ్డి, అర్జున్, రమణయ్య, మల్లేష్‌గౌడ్, రమేష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యాసంస్థలకు మహర్దశ

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వ విద్యాసంస్థలకు మహర్దశ పట్టిందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.పటాన్‌చెరు మండలం ముత్తంగి గ్రామంలో మన ఊరు–మన బడి, మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పునరుద్ధరణ, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నూతన భవనం, వంట గదులు, డైనింగ్‌హాల్ పనులను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మన ఊరు– మన బడి పథకం ద్వారా నియోజకవర్గ వ్యాప్తంగా మొదటి దశలో 55 పాఠశాలల్లో వివిధ పనులు చేపట్టామని తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు క్రమశిక్షణ పాటించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు వారంలో మూడు రోజుల పాటు రాగి జావ, మరో మూడు రోజులు గుడ్లు అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా రెండు కోట్ల రూపాయలతో అతి త్వరలో పాఠశాల భవనాన్ని విస్తరించనున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ అలరించాయి. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, ఎంపీపీ సుష్మా శ్రీ, జెడ్పిటీసీ సుప్రజా,వైస్ ఎంపీపీ స్వప్న శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ ఉపేందర్, ఆత్మ కమిటీ చైర్మన్ కుమార్ గౌడ్, పంచాయతీరాజ్ డీఈ సురేష్, ఉప సర్పంచ్ లింగారెడ్డి, మండల విద్యాధికారి రాథోడ్, సింగిల్ విండో చైర్మన్ బిక్షపతి, పాఠశాల సిబ్బంది ,విద్యార్థులు పాల్గొన్నారు.

మోదీ హయాంలోనే దేశాభివృద్ధి



మాదాపూర్‌లోని సాయినగర్‌లో మట్టిని సేకరించిన బీజేపి నాయకులు

మాదాపూర్: ఆజాదీ అమృత్ మహోత్సవ్ ముగింపు కార్యక్రమంలో భాగంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు.. ఢిల్లీలో అమృత్ మహోత్సవ్ స్తూపం నిర్మించడానికి ప్రతి గ్రామం నుంచి మట్టి సేకరిస్తున్న కార్యక్రమంలో భాగంగా మాదాపూర్‌లోని సాయినగర్‌లో శుక్రవారం బీజేపీ నాయకులు మట్టిని సేకరించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్.నరేష్, ప్రభాకర్ యాదవ్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎస్. హరికృష్ణ, డివిజన్ అధ్యక్షులు చారి పాల్గొన్నారు.

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రధాని నరేంద్ర మోదీ హయాంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గోదావరి అంజిరెడ్డి అన్నారు. శుక్రవారం రామచంద్రాపురం పట్టణంలోని శ్రీ సాయినగర్ కాలనీ సాయిబాబా ఆలయంలో మేరీ మాటి మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదల అభివృద్ధి కోసం ప్రధాని పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని తెలిపారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామం నుండి చిటికెడు మట్టిని సేకరించి ఢిల్లీలో నిర్మించబోయే ఆజాద్ కా అమృత్ మహోత్సవ్ స్తూపం కొరకు ఉపయోగించనున్నారని తెలిపారు. నేటి నుండి 15 రోజులు ప్రతి గ్రామం నుంచి మట్టిని, బియ్యం గింజలను స్వీకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రామచంద్రాపురం డివిజన్ పార్టీ అధ్యక్షులు నర్సింగ్ గౌడ్, నాయకులు అంజిరెడ్డి, జగదీష్,లక్ష్మణ్ గౌడ్, ప్రవీణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ముత్తంగిలో..

పటాన్‌చెరు టౌన్: మండలంలోని ముత్తంగిలో శుక్రవారం మేరీ మాటి మేరా దేశ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో డి.ఎస్ కాలనీలో ఇంటింటికి వెళ్ళి మట్టిని సేకరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.